సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 (టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

సీతంపేట : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలని సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి డి.రామారావు సూచించారు. జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లో గల ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. 3, 4, 5 తరగతుల పిల్లలతో మాట్లాడి పాఠ్యాంశాలపై ఎంత వరకు పట్టు ఉందో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థుల అభ్యసనా సామర్థ్యాలను బట్టి వారి స్థాయికి తగినట్టు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.దేముడు బాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ధ్వజస్తంభం ప్రతిష్ట



క్రేన్ సాయంతో ప్రతిష్టిస్తున్న నూతన ధ్వజస్తంభం

డాబాగార్డెన్స్: నగరంలోని పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డులో వేంచేసి ఉన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలువురు దాతల సహాయ సహకారాలతో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, ఆలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం, వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రసాదం పంపిణీ చేశారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను సోమవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ (సీబీఐ) జేటీ నాయుడు సిబ్బందితో విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లాకు చెందిన రింకిమాలి విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. జీఆర్పీ సిబ్బంది అతని నుంచి 12 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

తండ్రి చెంతకు తనయుడు



కుటుంబ సభ్యులతో అరునవ్, శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు

సీతమ్మధార: ఈ యువకుడి పేరు అరునవ్ దేవ్. త్రిపుర జిల్లా కుమార్ ఘాట్ నివాసి. అనారోగ్యంతో తల్లి మృతి చెందడంతో తండ్రి రెండో పెళ్లి చేసుకోవడంతో విభేదించి పిన్ని ఇంటికి వెళ్లిపోయాడు. ఇంటర్ చదువుతూ ఇంటి అక్కడ నుంచి పారిపోయి విశాఖ వచ్చేశాడు. తీవ్ర మనోవేదనతో బాధపడుతున్నాడు. ఇది గమనించిన ఏయూటీడీ సిబ్బంది అరునవ్‌ను నవంబర్ 2024లో చేరదీసి ద్వారకానగర్‌లోని జీవీఎంసీ – ఏయూటీడీ వసతిగృహానికి తరలించి వైద్య సేవలు అందించారు. దీంతో కోలుకున్న అరునవ్‌ను సోమవారం త్రిపుర తీసుకువెళ్లి తండ్రికి అప్పగించారు. కుమారుడ్ని చూసి తండ్రి ఆనందం వ్యక్తం చేశాడు. తన కుమారుడిని అప్పగించిన ఏయూటీడీ, శ్రద్ధా ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాయామంతో ఆనందం.. ఆరోగ్యం

ఫిట్‌నెస్‌పై యువత దృష్టి

జిమ్‌లకు క్యూ కడుతున్న వైనం

వ్యాయామ శాలలో ఆధునిక పరికరాలు





వేంకటేశ్వరమెట్టపై ఏర్పాటు చేసిన జిమ్‌లో వర్కవుట్స్ చేస్తున్న యువకులు

అల్లిపురం: వ్యాయామం మంచి ఆరోగ్యానికి చాలా అవసరం. రోజూ వ్యాయామం చేయడం వల్ల బరువు నిర్వహణలోనే కాదు. ఆరోగ్యాన్ని మంచి బాటలో ఉంచుకోవడానికి కూడా సహకరిస్తుంది.నేటి యువత ఫిట్‌నెస్ కోసం పరితపిస్తోంది. మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు యువతీ యువకులు సాధారణ వ్యాయామానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో నగరంలో అత్యాధునిక వ్యాయామశాలలు అందుబాటులోకి వచ్చాయి.



జీవీఎంసీ 33వ వార్డు వేంకటేశ్వరమెట్టపై కొంత మంది యువకులు ఔత్సాహికుల కోసం అత్యాధునిక వ్యాయామశాలలను ప్రారంభించారు. ఈ వ్యాయామశాలలో యువతకు ఉచితంగానే సేవలు అందజేస్తున్నారు. వార్డులో యువత వ్యాయామశాలకు వెళ్లేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఎంజీఎం హై స్కూలు వద్ద ఏర్పాటు చేసిన వ్యాయామశాల యువత ఆరోగ్యానికి సహకరిస్తోంది. వ్యాయామంతో శారీరక దారుఢ్యం మెరుగుపరచుకోవచ్చని యువకులు భావిస్తున్నారు. కరోనా తరువాత వ్యాయామంపై అందరికీ అవగాహన పెరిగింది. నడక, యోగా తరువాత స్థానం వ్యాయామం ఆక్రమించిందని చెప్పవచ్చు. ట్రెడ్‌మిల్, వాకర్స్, డంబుల్స్, వెయిట్ లిఫ్టింగ్ తదితర ఆధునిక వ్యాయామ పరికరాలను నిర్వాహకులు జిమ్‌లో ఏర్పాటు చేశారు.

ఒత్తిడి, ఆందోళన తగ్గిస్తుంది

వ్యాయామం నిరంతరం చేయడంతో అది సహజ ఒత్తిడి నివారిణిగా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఎండార్ఫిన్‌లను విడుదల చేయటంతో మెదడులోని రసాయనాలు సహజ నొప్పి నివారణిగా పనిచేస్తాయి.

వ్యాధి నిరోధకతను పెంచుతుంది

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయవచ్చు. సాధారణ జలుబు, ఫ్లూ వంటి వ్యాధుల సంక్రమణం తక్కువగా ఉంటుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. యాంటిబాడీస్‌ని ప్రేరేపిస్తుంది. ఇవి ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి యాంటిబాడీస్ సహాయపడతాయి. 3 వ్యాయామం నిరంతరం చేయడంతో అది సహజ ఒత్తిడి నివారిణిగా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఎండార్ఫిన్‌లను విడుదల చేయటంతో మెదడులోని రసాయనాలు సహజ నొప్పి నివారణిగా పనిచేస్తాయి.

ఎముకలు, కండరాలు పటిష్టం

నడక, జాగింగ్, వెయిట్ లిఫ్టింగ్ వంటి బరువు మోసే వ్యాయామాలు ఎముకలు, కండరాల నిర్మాణంలో సహాయపడతాయి. ఎముకల సాంద్రతను కాపాడుతుంది.

నిద్రలేమిని తగ్గిస్తుంది

శారీరక శ్రమ వలన మెరుగైన నిద్ర పడుతుంది. నిద్రలేమిని తగ్గిస్తుంది. నిద్రించే సమయంలో వ్యాయామం చేయకపోవడమే మంచిదని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు. దీని వలన నిద్రకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు.

యువతకు ఎంతో అవసరం



వ్యాయామ శాలలు యువతకు ఎంతో అవసరం. 33వ వార్డు యువతకు ఆ అవకాశం కలిగింది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేస్తున్నాం. అన్నిరకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

– అట్టాడ సత్యసాయి, బంగారుమెట్ట

జిమ్‌లో మంచి సౌకర్యాలున్నాయి



వేంకటేశ్వరమెట్టపై ఏర్పాటు చేసిన జిమ్‌లో మంచి సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. యువత ఉపయోగించుకోవాలి.

–భాగి వినీత్ కుమార్ రెడ్డి, వేంకటేశ్వరమెట్ట

జీకే ఫౌండేషన్ సహకారంతో..



జీకే ఫౌండేషన్ సహకారంతో వార్డులో జీవీఎంసీ అనుమతులు తీసుకుని జిమ్ ఏర్పాటు చేశాం. అన్ని రకాల ఆధునిక జిమ్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంది. ట్రైనర్లు అందుబాటులో ఉన్నారు. ఆసక్తి కలిగిన యువత ఈ జిమ్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చు.

–ఆకుల రాజు, బంగారుమెట్ట

అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ



కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరిస్తూ ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తి గత వాహనాలు విడనాడి ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆమె సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడాలని పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వ్యవస్థను, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని, అందుకు అందరూ సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.

కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం



వివరాలు వెల్లడిస్తున్న జీఎస్‌జే అత్యుతరావు, తదితరులు

అల్లిపురం: వివిధ రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన, పోరాటాలకు అందరూ సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అత్యుతరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 11న మహాధర్నా నిర్వహించిన తర్వాత కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు ఎస్‌కే రహమాన్, కార్యదర్శి పడాల గోవిందు, సీహెచ్ కాసుబాబు, ఎస్.నాగభూషణం పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేటలో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి 25వ వార్షిక జాతర మహోత్సవాల పోస్టర్ సోమవారం ఉదయం ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 7 వరకు మూడు రోజులపాటు జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 25వ వార్షికోత్సవం సందర్భంగా 5న అమ్మవారి ఆభరణాల ఊరేగింపు, 6న తొలేళ్ల ఉత్సవం, 7న అమ్మవారి ప్రధాన జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు అమ్మవారి అభిషేకానికి మహిళలు పోలేరమ్మ సదనం పట్టు నుంచి పసుపు, కుంకుమ కలిపిన ఉదకంతో నిండిన కళశాలతో తిరువీధి ఉత్సవం, సాయంత్రం దేవాలయం ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అనుపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ, గనగళ్ల సత్యవతి, బొడ్డేటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యానికి రెక్కలు



రేషన్ బియ్యంపై ఆరా తీస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మాసిపోగు రాజు



వివరాలు సేకరించి మిషన్ తీసుకెళ్తున్న ఆర్‌ఐ

డాబాగార్డెన్స్: రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొందరు వ్యాపారులు పేదల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనగోలు చేసి ఒడిశా, చత్తీస్‌ఘడ్‌కు తరలిస్తున్నారు. కొందరు డీలర్లే బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. సోమవారం జీవీఎంసీ పరిధి 36వ వార్డులో రేషన్ జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం.. వివరాల్లోకి వెళ్తే..వార్డు పరిధిలో పలువురు రేషన్ లబ్ధిదారులకు ఈ నెల 1 నుంచి రేషన్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే సోమవారం పౌరసరఫరా విభాగం నుంచి 148 డిపోనకు సంబంధించిన రేషన్ పంపిణీదారుడు కిషోర్, డ్రైవర్ (బియ్యం పంపిణీ చేసే వాహనం నంబరు ఏపీ39టీఆర్4505) నరేంద్ర..1200 కేజీల బియ్యం ఇన్‌వర్డ్‌లో చూపించి, కేవలం 50 కేజీల బియ్యం మాత్రమే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు తీసుకొచ్చారు. గత రెండు రోజులుగా ఇదే తరహాలో జరుగుతున్న తంతును వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు మాసిపోగు రాజు పసిగట్టారు. సోమవారం కూడా అతి తక్కువ బియ్యం తీసుకు రావడంతో డీలర్, డ్రైవర్‌ని నిలదీశారు. ఎంత ఇన్‌వర్డ్ చేసుకున్నారు? కేవలం 50 కేజీల బియ్యమే ఎందుకు తెచ్చారు? మిగిలిన బియ్యం ఎక్కడ? అంటూ నిలదీశారు. డీలర్, డ్రైవర్ సమాధానం చెప్పకపోవడంతో ఆర్‌ఐకి ఫోన్ చేసి రప్పించారు. ఆర్‌ఐ వచ్చి రికార్డులు వెరిఫై చేసుకున్నారు. మెషిన్ తీసుకుని వెళ్లారు.

టీబీపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీబీ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సేక్రెడ్ హార్ట్ బాలికోన్నత పాఠశాలలో కంచరపాలెం ఆర్పీపేట ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) టీబీ సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో టీబీ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వ అనేక కార్యక్రమాలు చేపట్టిందని, సమాజంలో ఆడ, మగ బేధం ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎస్ఈ సూర్యనారాయణ, ఎస్‌టీఎల్ఎస్ శరత్‌బాబు, టీబీహెచ్‌వీ నూనెల పైడిరాజు, ఉపాధ్యాయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేసులు నమోదు చేసే శ్రద్ధ.. ట్రాఫిక్ నియంత్రణలో లేదు



ఏవీఎన్ కళాశాల వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

డాబాగార్డెన్స్: వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులకు చలానాలు రాసే శ్రద్ధ..ట్రాఫిక్ నియంత్రణలో కనిపించడం లేదు. అందుకు నిదర్శనమే సోమవారం ఏవీఎన్ కళాశాల వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్. వివరాల్లోకి వెళ్తే.. నిత్యం స్టేషన్ పరిధి పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి జంక్షన్, రీడింగ్ రూమ్, ఏవీఎన్ కాలేజ్ డౌన్..ఇలా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. హెల్మెట్ లేకపోయినా..రికార్డులు లేనివారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉంది. వాస్తవానికి ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన బాధ్యత ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టకుండా..కేవలం కేసుల నమోదుకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం ఏవీఎన్ కళాశాల వద్ద మధ్యాహ్నం 12 గంటల సమయంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఒక్క పోలీసు కూడా ఆ సమయంలో లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటు వాహనచోదకులు, కళాశాలలో ఇంటర్ పరీక్ష రాసిన విద్యార్థులు ట్రాఫిక్ నుంచి తప్పించుకునేందుకు అవస్థలు పడ్డారు. ఇటు కాలేజ్ డౌన్ వరకు..అటు రెల్లివీధి వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది.

ఘనంగా ముత్యాలమ్మ పుట్టమన్ను ఊరేగింపు



పుట్టమన్ను ఊరేగింపులో భక్తులు, కమిటీ సభ్యులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులోని నక్కవానిపాలెంలో గల గ్రామదేవత ముత్యాలమ్మ పండగ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం పుట్టమన్ను ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం నుంచి శివాలయం వద్దకు పుట్టమన్ను (దేవర) తీసుకొచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న పీర్లు పండగ, 10న తొలేళ్ల ఉత్సవం, 11న అనుపోత్సవం, 18న మారు వారం ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు గుడ్ల కాటరాజురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు బోర రవికుమార్‌రెడ్డి, కార్యదర్శి కారపురెడ్డి శ్యామ్‌రెడ్డి, నందిక వేణురెడ్డి, కోశాధికారి ధర్మాల గురుమూర్తిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బడ్జెట్‌తో కార్పొరేట్ విద్యా సంస్థలకు లబ్ధి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌వో నాయకులు

సీతమ్మధార: విద్యా రంగంలోని కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చుతూ విద్యార్థుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేసేలా రూపొందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్లను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పీడీఎస్‌వో ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్ మాట్లాడుతూ ఒక దేశం అభివృద్ధికి విద్య చాలా కీలకమని, ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా గుర్తింపు పొందాలంటే విద్య చాలా ముఖ్యమన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2025 – 26 బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.1.28 లక్షల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ఉన్నత విద్యకు గత ఏడాది కంటే 4.4 శాతం మాత్రమే పెంచారని తెలిపారు. మేకిన్ ఇండియా అని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యకు ప్రాధాన్యమిచ్చి, కొత్త ఆవిష్కరణల వైపు విద్యార్థులను ప్రోత్సహించకుండా యూనివర్సిటీల ప్రమాణాలను గంగలో కలుపుతోందని ఆరోపించారు. కార్పొరేటీకరణకు ఊతమిస్తూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కేంద్ర బడ్జెట్ మోసపూరితమైందని మండిపడ్డారు. పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాఠశాల విద్యకు కేవలం రూ.31,805 కోట్లు మాత్రమే కేటాయించారని... ఈ మొత్తం ఉద్యోగుల వేతనాలు, అలవెన్సులకు మాత్రమే సరిపోతుందన్నారు. 'తల్లికి వందనం' పథకానికి రూ.13,113 కోట్లు అవసరమైతే, కేవలం రూ.9,407 కోట్లే కేటాయించారన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఏటా రూ.2,800 కోట్లు అవసరమైతే, కేవలం రూ.1,960 కోట్లే కేటాయించారన్నారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ బకాయిల ఊసే లేదని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సతీష్, జానకి, రాకేష్, లక్ష్మణ్, శివ, మణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడుల నియంత్రణ సామాజిక బాధ్యత



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న సైకాలజిస్ట్ ఉదయ్‌కుమార్

సీతంపేట : పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా చూసుకోవడం తల్లిదండ్రుల బాధ్యతే కాకుండా మనందరి సామాజిక బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పిల్లలపై లైంగిక దాడులు ఏవిదంగా నివారించాలి అనే అంశంపై జిల్లా ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సోమవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడుల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి రక్షణ కల్పించాలన్నారు. సైకాలజిస్ట్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, నేడు స్వతంత్ర కుటుంబాలుగా జీవించడం వల్ల పిల్లల ఎదుగుదలకు సరైన విషయాలు బోధించే వారు కరువయ్యారన్నారు. పిల్లలకు ఏది మంచి, ఏది చెడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలియజేయాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పిల్లలపై దాడులను ఎలా ఎదుర్కోవాలో వివరించారు.

శిశువుల్లో వినికిడి లోపాలు గుర్తించాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు

సీతంపేట : ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ పిల్లలు శిశువులుగా ఉన్నప్పుడే శబ్దాలకు స్పందిస్తున్నారో..? లేదో..? తల్లిదండ్రులు గుర్తించి చిన్నపిల్లల వైద్యులను సంప్రదించి తనిఖీ చేయించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా చెవిటితనం, వినికిడి లోపాన్ని ఎలా నివారించాలో అవగాహన కల్పించడానికి ఏటా మార్చి 3న ప్రపంచ వినికిడి దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వినికిడి శక్తిని ఏటా తనిఖీ చెయ్యాలని, మీ స్కోరు 50 కంటే తక్కువ ఉంటే ప్రొఫెషనల్‌ని సంప్రదించాలని సూచించారు. జిల్లాలో డీఈఐసీ కేజీహెచ్, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు.